పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా : జీ4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017

తిరునల్వేలి జిల్లాలో వరదనీటిలో మునిగిన మురుగన్ ఆలయం





విరుదునగర్ జిల్లా రాజపాళయంలో ప్రహరీ కూలిపడటంతో ధ్వంసమైన రేకుల షెడ్డు



తిరునల్వేలిలో భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇల్లు





తేని జిల్లా మార్గయన్‌కోట వద్ద నీట మునిగిన ట్రాన్స్‌ఫార్మర్, ఇళ్లు

దక్షిణాదిని ముంచెత్తిన వర్షాలు

● బంగాళాఖాతంలో పొంచి వున్న వాయు‘గండం’

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు వర్షాలను కూడా వెంట తీసుకురావటంతో దక్షిణాది జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. ప్రత్యేకించి తిరునల్వేలి, విరుదునగర్, విల్లుపురం, తేని, నీలగిరి, చెంగల్పట్టు, తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాలో రెండు రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 24న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే అంచనా కంటే మూడు రోజులు ముందుగానే మంగళవారం అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశముందని నుంగంబాక్కంలోని వాతావరణ కేంద్రం శనివారం హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడే వాయుగుండం ప్రభావంతో కోస్తా తీరం వెంబడి 35-55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి జిల్లాలోనూ, తేని జిలాలో 32యేళ్ల అనంతరం కురిసిన భారీ వర్షాలకు నివాసప్రాంతాలు, వ్యవసాయ భూముల్లో వరదనీరు చేరింది. అదేవిధంగా చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, నామక్కల్, కరూర్, తిరుప్పూర్, చెంగల్పట్టు, శివగంగ, విరుదునగర్, రామనాథపురం, కన్నియాకుమారి, నీలగిరి, కోవై జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు. దీపావళి రోజైన సోమవారం రాష్ట్రంలోని చెంగల్పట్టు, కళ్లకురుచ్చి, కడలూరు, మైలాడుదురై, తిరువారూర్, తంజావూరు, నాగపట్నం, విల్లుపురం తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు. ఇక ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా నగరంలో శుక్రవారం సాయంత్రం నుండి శనివారం వేకువజాము వరకు ఉరుములు మెరుపులు, పెనుగాలులతో వర్షాలు కురిశాయి. మనలి, రాయపురం, వాషర్‌మెన్‌పేట, రాయపేట, ట్రిప్లికేన్, మాంబళం, వడపళని, కోయంబేడు, పెరంబూరు, నుంగంబాక్కం, మధురవాయల్, పూందమల్లి, అంబత్తూరు, ఆవడి, తాంబరం, గిండి, అడయార్, వేళచ్చేరి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి.

దక్షిణాది జిల్లాల్లో...

ఈశాన్య రుతుపవనాల ఆగమన ప్రభావంతో తిరునల్వేలి, తేని, తిరువారూరు తదితర దక్షిణాది జిల్లాల్లో గత రెండు రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. దీంతో నదులు, చెరువులు, జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. తేని జిల్లాలో 32 యేళ్ల తర్వాత కుండపోత కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. కోతకు సిద్ధంగా ఉన్న పంటపొలాలు నీట మునిగాయి. రహదారులు జలమయమయ్యాయి. మూలవైగై తదితర నదులు, చెరువులు నీటితో నిండి జనవాసాల వైపు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ జిల్లాకు శుక్రవారం ఆరెంజ్ అలర్ట్ ప్రకటించడంతో సాయంత్రం నుండి శనివారం వేకువజాము వరకూ కుండపోతగా వర్షం కురిసింది. మూడు దశాబ్దాల తర్వాత ఈ స్థాయిలో వర్షం కురవటం ఇదే మొదటిసారని స్థానికులు చెబుతున్నారు. కంభం - సురుళిపట్టి రహదారిలో ముల్లైపెరియార్ నదిలో వరద నెలకొంది. ఫ్లైవోవర్‌పై వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలను నిషేధించి పోలీసులు ఇరువైపులా కాపలా కాస్తున్నారు. సురుళిపట్టి వద్ద ముల్లై పెరియార్ వాగులో వరదల కారణంగా లక్ష్మణన్ అనే రైతు తన పాకలో కట్టి ఉంచిన 60కి పైగా మేకలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. దేవారం ప్రాంతంలో 10 వేలకు పైగా కోళ్లు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బాధిత ప్రాంతాలను ఎంపీ తంగ తమిళ్‌సెల్వన్ సందర్శించారు. గూడలూరులో రాత్రంతా కురిసిన వర్షాలకు అక్కడి ప్రైవేటు పాఠశాల ప్రహరీగోడ కూలిపడింది. ఇదే విధంగా చిన్నమనూరు వద్ద భారీ వర్షాలకు ఐదు వేల ఎకరాల విస్తీర్ణంలోని అరటి చెట్లు నీట మునిగాయి.

మునిగిన మురుగన్ ఆలయం...

తిరునల్వేలిలో కురిసిన భారీ వర్షాలకు కురుక్కుతురై వద్దనున్న సుప్రసిద్ధ మురుగన్ ఆలయం నీట మునిగింది. జిల్లాలోని అంబై, చేరన్‌మహాదేవి, రాధాపురం, కల్లకాడు, ముల్లైకారపట్టి తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా కుండపోతగా వర్షాలు కురిశాయి. తిరునల్వేలి నగరం, సబర్బన్ ప్రాంతాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి. విరుదునగర్ జిల్లా రాజపాళయంలో ప్రహరీగోడ కూలిపడటంతో ఓ రేకులషెడ్డు ధ్వంసమై వంద మేకలు మృతి చెందాయి.

గోడ కూలి మహిళ మృతి...

తిరునల్వేలిలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఓ ఇంటి గోడ కూలిపడి వృద్ధురాలు మృతి చెందింది. మేల్‌పాళయం ప్రాంతం కురింజి మరుదు పాండియర్ ఒకటో వీధిలో నివసిస్తున్న ముత్తయ్య మట్టి ఇంటిలో నివిస్తున్నాడు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఆ ఇల్లు నీటిలో నానటంతో శనివారం వేకువజాము ఓ వైపు గోడ కూలి మదాత్తియమ్మాళ్ (75) అనే వృద్ధురాలు మృతి చెందింది.



చిన్నమనూరు వద్ద నీట మునిగిన అరటి తోటలు



ద్రవిడ కళగం నేత వీరమణికి చెక్కు అందజేస్తున్న సీఎం స్టాలిన్

పెరియార్ వరల్డ్ నిర్మాణానికి రూ. 1.7 కోట్లు

● వీరమణికి చెక్కు అందజేత

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా సిరుగానూరులో ఏర్పాటుకానున్న 'పెరియార్ వరల్డ్' భవన నిర్మాణం కోసం డీఎంకే తరఫున రూ.1.70 కోట్లను ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం ఉదయం ద్రవిడ కళగం నేత కె.వీరమణికి అందజేశారు. పెరియార్ సిద్ధాంతాలను భావితరాలకు తెలియజేసేలా 27 ఎకరాల్లో పెరియార్ వరల్డ్ నిర్మాణం జరుగనుంది. అక్కడ 60 అడుగుల ఎత్తు పీఠంపై 95 అడుగుల పెరియార్ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. పెరియార్ వరల్డ్ వద్ద గ్రంథాలయం, ఉద్యానవనం, కళాభవనం కూడా నిర్మించనున్నారు. ఈ భవన నిర్మాణాలకు డీఎంకే ఎంపీలు ఒక నెల వేతనాన్ని విరాళంగా అందజేయనున్నట్లు ఇదివరకే స్టాలిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మేరకు శనివారం ఉదయం వేప్పేరి పెరియార్ దిడల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ద్రవిడ కళగం నేత వీరమణికి ఆయన రూ.1.70 కోట్ల చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, పీకే శేఖర్‌బాబు, ఎంపీలు టీఆర్ బాలు, ఎ.రాజా తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి రోడ్డెక్కిన వాహనాలు

● నగరం నలువైపులా స్తంభించిన ట్రాఫిక్

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను స్వస్థలంలో జరుపుకునేందుకు లక్షలాదిమంది ఒకే సమయంలో బయలుదేరటంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వేకువజాము వరకూ నగరం నలువైపులా వాహనాల రాకపోకలు స్తంభించాయి. క్రోంపేట, తాంబరం, మధురవాయల్, కోయంబేడు, పూందమల్లి ప్రాంతాల్లో వాహనాలు నత్తనడక నడిచాయి. సోమవారం దీపావళి, దానికంటే ముందు శని, ఆదివారాలు రావటంతో నగరంలో ఉద్యోగ, వ్యాపార రీత్యా బసచేస్తున్న వివిధ ప్రాంతాలకు చెందినవారంతా గురువారం సాయంత్రమే బస్సుల్లో బయలుదేరారు. గురువారం సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సుమారు వెయ్యి బస్సుల్లో దక్షిణాది జిల్లాల వాసులంతా పయనమైనట్లు అధికారులు గణాంకాలు తెలియజేస్తున్నాయి. శుక్రవారం రాత్రి ఉన్నట్టుండి అటు కిలాంబాక్కం, ఇటు కోయంబేడు బస్‌స్టేషన్ సమీప ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఆమ్నీ బస్సులు బయలుదేరాయి. దీంతో కోయంబేడు - పూందమల్లి హైరోడ్డు వాహనాలన్నీ నత్తనడకనడిచాయి. ఇదే విధంగా తాంబరం, క్రోంపేట, పెరుంగళత్తూరులోనూ పండుగ స్పెషల్ ప్రత్యేక ఆమ్నీ బస్సులు వందల సంఖ్యలో బయలుదేరాయి. అవన్నీ కాట్టాన్‌కుళత్తూరు దాటేందుకు సుమారు గంట పట్టింది. వండలూరు, కిలాంబాక్కం, పొత్తేరి, కాట్టాన్‌కుళత్తూరు, సింగపెరుమాళ్ కోవిల్, మహేంద్రా సిటీ ప్రాంతాల్లో వాహనాలు నత్తనడక నడిచాయి. శనివారం ఉదయం కూడా ఈ మార్గంలో వివిధ నగరాలకు వెళ్లే బస్సులు నెమ్మదిగా నడిచాయి. దీంతో ఆ రహదారిలో ట్రాఫిక్ రెండు గంటలకు పైగా స్తంభించింది. ఇదే విధంగా దీపావళి సెలవులకు బయలుదేరిన ప్రయాణికులతో సెంట్రల్ రైల్వేస్టేషన్, ఎగ్మూరు రైల్వేస్టేషన్, తాంబరం రైల్వేస్టేషన్ కిటకిటలాడాయి. శనివారం వేకువజాము మూడు నుండి ఉదయం ఎనిమిది గంటల దాకా నగరంలోని నలుమూలల ఓ మోస్తరుగా వర్షాలు కురవటంతో రహదారులు జలమయమయ్యాయి.



శివారులో స్తంభించిన ట్రాఫిక్

5వేల మంది పోలీసులతో దీపావళి బందోబస్తు

ప్యారీస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాల్లో దీపావళి పండుగను పురస్కరించుకుని సుమారు 5వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. పండుగ కోసం ప్రజలు నూతన వస్త్రాలు, ఆభరణాలు, టపాసులు తదితరాలను కొనుగోలు చేసేందుకు మార్కెట్లకు పెద్దసంఖ్యలో వస్తున్నారు. నగరంలో ప్రముఖ వాణిజ్య ప్రాంతాలైన టి.నగర్, నుంగంబాక్కం, మైలాపూర్, పురుషవాక్కం, పెరంబూరు, పాడి, క్రోంపేట, ఎగ్మూర్, ప్యారీస్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచే రద్దీ కనిపించింది. రద్దీలో జేబు దొంగలు చేతివాటం చూపించకుండా కట్టడి చేసేందుకు గ్రేటర్ చెన్నై పోలీస్‌శాఖ షాపింగ్ మాల్స్, మార్కెట్ సంత వీధులు జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో నిఘాను ముమ్మరం చేసింది. సీసీ కెమెరాలు, వాచ్‌టవర్ ద్వారా పోలీసులు నిఘావేస్తున్నారు. మరోవైపు హ్యాండ్‌మైక్, లౌడ్ స్పీకర్ల ద్వారా రద్దీలో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలను హెచ్చరిస్తున్నారు.

కరూర్ సిట్ కార్యాలయం వెనుక కాలిన దస్తావేజులు

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టీవీకే నేత విజయ్ కరూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో 41 మంది మృతి చెందిన ఘటనపై విచారణ జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కార్యాలయ భవనం వెనుక కాలిన దస్తావేజులు, సగం కాలిన పెన్ డ్రైవ్ పడి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు కరూర్ దుర్ఘటనపై విచారణ ప్రారంభించిన సీబీఐ అధికారులకు సిట్ అధికారి ఐజీ అస్రాగార్గ్ శుక్రవారం దర్యాప్తునకు సంబంధించి 640 పేజీల పత్రాలను, 1300 పేజీల ఆధారాలను అప్పగించారు. ఇదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ అరుణా జగదీశన్ కమిటీ కూడా ఒకటెరండు రోజుల్లో తమ విచారణకు సంబంధించిన పత్రాలను సీబీఐ అధికారులకు అప్పగించనుంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కరూర్‌లో సిట్ అధికారులు కార్యాలయంగా ఉపయోగించిన భవనం వెనుక వందల సంఖ్యలో కాలిన కాగితాలు, వాటి పక్కనే సగం కాలిన పెన్ డ్రైవ్ పడి ఉండటాన్ని చూసిన స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పెన్‌డ్రైవ్ స్వాధీనం చేసుకుని విచారణ జరుపుతున్నారు. కాలిబూడిదైన కాగితాలు సిట్ దర్యాప్తునకు సంబంధించినవిగా ఉంటాయని అనుమానిస్తున్నారు. ఈ సంఘటన గురించి కూడా సీబీఐ అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



సిట్ ఆఫీసు వెనుక పడి ఉన్న కాలిన కాగితాలు, పెన్ డ్రైవ్

అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ శ్రీకారం

● 234 నియోజకవర్గాలకు ఇన్‌చార్జుల నియామకం
● వేళచ్చేరికి కరాటే త్యాగరాజన్, థౌజెండ్ లైట్స్‌కు ఖుష్బూ

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులతోపాటు ఇద్దరు సహాయకులను నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ప్రకటించారు. ఆ మేరకు నగరంలోని థౌజెండ్ లైట్స్ నియోజకవర్గానికి సినీనటి ఖుష్బూ, వేళచ్చేరి నియోజకవర్గానికి కరాటే త్యాగరాజన్‌ను నియమించారు. అన్నానగర్‌కు లతా షణ్ముఖసుందరం, ఎగ్మూరుకు వెంకటేష్, విల్లివాక్కంకు ధనశేఖర్, మాధవరానికి జి రాధాకృష్ణన్, అంబత్తూరుకు ఎస్‌ఎం.చక్రవర్తి, మధురవాయల్‌కు కేపి జయకుమార్, ఆర్కేనగర్‌కు వన్నియరాజన్, తిరువొత్తియూరుకు ఎస్‌ఆర్ రామయ్యా, టి.నగర్‌కు వినోజ్ సెల్వం, సైదాపేటకు లక్ష్మీ, విరుగంబాక్కంకు రమేష్ శివా, మైలాపూరుకు కరునాగరాజన్, చేపాక్‌కు నదియా శ్రీనివాసన్, హార్బర్‌కు జి.కె. సురేష్, చోళింగనల్లూరుకు రాజ్‌కుమార్, ఆలందూర్‌కు నారాయణ తిరుపతి, తాంబరానికి కేటీ రాఘవన్, రాయపురానికి ప్రకాస్, తిరువిక నగర్‌కు ఇలంగో, కొళత్తూరుకు పాల్‌కనకరాజ్, పెరంబూరుకు ఎస్‌ఆర్ ఇలమది నియమితులయ్యారు. ఇదే విధంగా తక్కిన అసెంబ్లీ నియోజకవర్గాలన్నింటికీ ఇన్‌చార్జులను నియమించారు.



ఖుష్బూ, కరాటే త్యాగరాజన్

మందుబాబులే టార్గెట్

దీపావళి అమ్మకాలకు రూ.600 కోట్ల మద్యం సిద్ధం



చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా టాస్మాక్ దుకాణాల్లో మద్యం అమ్మకాలు జోరందుకోనున్నాయి. నాలుగు రోజులపాటు దుకాణాల్లో మందుబాబులకు మేలైన సరకు సరఫరా చేయడానికి టాస్మాక్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దుకాణాల్లో అమ్మేందుకు రూ.600 కోట్ల విలువైన మద్యం నిల్వ ఉంచారు. సోమవారం దీపావళి పండుగ, వారాంతపు సెలవులు తోడు కావటంతో మంగళవారం వరకు టాస్మాక్ దుకాణాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతాయని అధికారులు ఆశిస్తున్నారు. రాష్ట్రంలోని 4829 మద్యం దుకాణాల్లో 15 రోజులకు సరిపడా స్టాకు సిద్ధం చేశారు. మొత్తానికి ఈ దీపావళికి రూ.600 కోట్ల మద్యం సరకులను విక్రయించడమే టార్గెట్‌గా నిర్ణయించారు.

‘వి’ నియోజకవర్గం నుంచే పోటీ?

● జ్యోతిషుల సూచనతో విజయ్ నిర్ణయం ● ఇప్పటికే 9 స్థానాల్లో సర్వే పూర్తి



చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ జ్యోతిష్యుల సూచన మేరకు 'వి' అక్షరంతో మొదలయ్యే నియోజకవర్గం నుంచే పోటీ చేయాలని భావిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. జ్యోతిషుల సూచన, తన సలహాదారుల నివేదికతో ఆయన ఇప్పటికే ఈ వ్యవహారంపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆ మేరకు రాష్ట్రంలో వి అక్షరంతో మొదలయ్యే 9 నియోజకవర్గాల్లో సర్వే కూడా పూర్తి చేయించుకున్నట్లు తెలిసింది. మరో ఏడు నెలల్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో ముమ్మర ప్రచారానికి సిద్ధమైన విజయ్‌కి.. కరూర్ తొక్కిసలాట ఘటన బ్రేక్ వేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ప్రత్యర్థుల విమర్శలు, అనుయాయుల ప్రతివిమర్శల సంగతెలాగున్నా.. రాజకీయాల్లో తను వెనకడుగేసే ప్రసక్తే ఇప్పటికే విజయ్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సినీరంగం నుంచి వచ్చిన విజయ్‌కి జ్యోతిష్యంపై అపారనమ్మకం వున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతుంటారు. వచ్చే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే మంచిదన్నదానిపై విజయ్ ఆస్థాన జ్యోతిషుడు పలు కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. 'వి' అక్షరంతో మొదలయ్యే నియోజకవర్గంలో పోటీ చేస్తే విజయావకాశాలున్నాయని ఆ జ్యోతిష్యుడు చెప్పడంతో ఆ మేరకు విజయ్ దృష్టి సారించినట్లు సమాచారం. వి అక్షరంతో మొదలయ్యే విల్లివాక్కం, విరుగంబాక్కం, విక్రవాండి, విరుదాచలం, విరాళిమలై, విరుదునగర్, విలాత్తికులం, విలవంగోడు, వీరపాండి నియోజకవర్గాల్లో సర్వే చేయించారు. ఆ సర్వే ఫలితాలు ప్రస్తుతం విజయ్ ముందున్నట్లు తెలిసింది. అంతేగాక ఆయా నియోజకవర్గాల్లో తన అభిమానులు, సన్నిహితుల నుంచి కూడా నివేదికలు తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. అన్నింటినీ బేరీజు వేసుకున్నాక విజయ్ తగిన నిర్ణయం తీసుకుంటారని టీవీకే నిర్వాహకులు చెబుతున్నారు.

సమాచార ధ్వని

21న ప్రభుత్వ సెలవు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి మరుసటిరోజు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.. ఈ ఏడాది దీపావళి పండగ ఈ నెల 20వ తేది (సోమవారం) రానుందని, నగర ప్రాంతాల్లో నివస్తున్న ప్రజలు, పండుగను తమ స్వగ్రామాల్లో జరుపుకునేందుకు వెళ్తున్నారని తెలిపింది. పండుగ మరుసటి రోజైన మంగళవారం పనిదినంగా కావడంతో పండుగ రోజే బయల్దేరాల్సి వస్తుందని, అందువల్ల మంగళవారం సెలవు ప్రకటించాలని ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. పరిశీలించిన ప్రభుత్వం, దీపావళి మరుసటిరోజైన మంగళవారం సెలవు రోజుగా ప్రకటించిందని, అందుకు బదులు ఈ నెల 25వ తేది పనిదినమని ప్రభుత్వం తెలిపింది.

డిసెంబరు 20న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రాతపరీక్ష

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 2,708 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి, డిసెంబరు 20న రాతపరీక్ష నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు ప్రకటించింది. ఇప్పటికే, 4వేల అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి టీఆర్బీ విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసి, కొత్తగా ప్రకటన విడుదల చేసింది. అందులో, 2,708 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు రాతపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అర్హులైన వారు నవంబరు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. తదుపరి రెండు రోజులు దరఖాస్తులో వివరాల సవరణకు అనుమతించి పరీక్ష తర్వాత ఇంటర్వ్యూ తేది ప్రకటించనున్నారు. వివరాలకు www.trb. tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని టీఆర్బీ తెలిపింది.

మెడికల్ సర్టిఫికెట్ కోర్సుల గడువు పెంపు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ స్టాన్లీ వైద్య కళాశాలలో మెడికల్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు నవంబరు 14 తేది వరకు అవకాశం కల్పించారు. స్టాన్లీ వైద్య కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి మెడికల్ సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నారు. ఈ కోర్సులకు దరఖాస్తు స్వీకరణ ముగిసిన నేపథ్యంలో, విద్యార్థుల సౌకర్యార్థం నవంబరు 18వ తేది వరకు పొడిగించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు https://www.stanletmedicalcollege.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 9840505701 నెంబరుకు సంప్రదించాలని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

మైక్రోమెటీరియల్స్ టెక్నాలజీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం పరిధిలోని సెంటర్ ఫర్ ఫ్యూచర్ మెటీరియల్స్ అండ్ టెక్నాలజీ నవంబరు 26 నుంచి డిసెంబరు 9వ తేది వరకు మైక్రోమెటీరియల్స్ టెక్నాలజీ పేరుతో ఆన్‌లైన్ కోర్సు అందిస్తోంది. కళాశాల విద్యార్థులు, ప్రొఫెసర్లు, పరిశోధన విద్యార్థులు, ఆసక్తి కలిగిన వారు నవంబరు 18వ తేదీలోపు https://www.annauniv.edu అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

వలసరవాక్కంలో ఐదుగురికి డెంగ్యూ లక్షణాలు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని 11వ మండలం వలసరవాక్కంలో ఐదుగురికి డెంగ్యూ లక్షణాలు నిర్ధారణయ్యాయి. బాధితులు ఐదుగురు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ మండలంలో డెంగ్యూ వ్యాప్తి అరికట్టేలా జీసీసీ చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

24 వరకు నెలవారీ బస్ పాస్ విక్రయాలు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నెలవారీ బస్ పాస్ విక్రయాలు ఈ నెల 24వ తేది వరకు పొడిగించారు. ఈ విషయమై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) మేనేజింగ్ డైరెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో.. ఈ నెల 16 నుంచి నవంబరు 15వ తేది వరకు ఎంటీసీ బస్సుల్లో (ఏసీ బస్సులు మినహా) రూ.1,000, ఏసీ బస్సులకు రూ.2,000 నెలవారీ పాస్‌లు ఎంటీసీ అందజేస్తోంది. ఈ బస్ పాస్‌లు ప్రతి నెల 7వ తేది నుంచి 22వ తేది వరకు విక్రయిస్తున్నారు. కాగా, ఈ మధ్యలో శని, ఆది, దీపావళి సెలవులు రావడంతో, ప్రయాణికుల సౌకర్యార్థం 23,24వ తేదీల్లోనూ నిర్దిష్ట ఎంటీసీ కౌంటర్ల నుంచి నెలవారీ బస్‌పాస్‌లు కొనుగోలు చేయవచ్చని ఎంటీసీ తెలిపింది.

ప్రతిభా పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారికి రూ.1.44 కోట్లు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రూ.1.44 కోట్ల స్కాలర్‌షిప్‌లను నవంబరు 15వ తేదీలోపు అందించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఎయిడెడ్ పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులకు ప్రతి ఏడాది ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈపరీక్షల్లో ఉత్తీర్ణులై విద్యార్థులకు అర్థిక ఆధారంగా స్కాలర్‌షిప్‌గా రూ.1,000 అందజేస్తున్నారు. ఈపరీక్షకు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను అనుమతిస్తుండగా, మున్సిపల్, కార్పొరేషన్ ప్రాంతాల విద్యార్థులను పరీక్ష రాసేందుకు వీలులేదు. ఈ పరీక్ష ప్రతి ఏడాది సెప్టెంబరు నెలలో నిర్వహిస్తుంటారు. ఈ ప్రకారం, గత ఏడాది నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి స్కాలర్‌షిప్ అందించేందుకు రూ.1.44 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

రేపటి నుంచి మెట్రోరైలు వేళల్లో మార్పులు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న మెట్రోరైలు వేళల్లో మార్పులు జరిగాయి. ఈ మేరకు చెన్నై మెట్రోరైలు లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) విడుదల చేసిన ప్రకటనలో.. బ్లూ, గ్రీన్, బ్లూ లైన్ మార్గాల్లో నిర్వహణ పనుల రీత్యా ఈ నెల 20 నుంచి 24వ తేది ఉదయం 5 నుంచి 6.30 గంటల వరకు రైళ్ల సమయాల్లో మార్పులు జరిగాయి. ఆ ప్రకారం, నిర్దిష్ట సమయంలో రెండు మార్గాల్లో ప్రస్తుతం 7 నిమిషాలకు ఒక రైలు నడుపుతుండగా, సోమవారం నుంచి శుక్రవారం వరకు 14 నిమిషాలకు ఒక రైలు నడపనున్నామని సీఎంఆర్ఎల్ తెలిపింది.

మదురై ఆలయ పరిసరాల్లో బాణసంచా నిషేధం

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి రోజున మదురై మీనాక్షి అమ్మవారి ఆలయం పరిసర ప్రాంతాల్లో బాణసంచా పేల్చడం నిషేధం విధించారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో.. చిత్తిరై, ఆవడి మాడ వీధుల్లో అగ్నిప్రమాదాల కారణమయ్యేలా టపాసులు కాల్చరాదని సూచించారు.

చిన్నారుల మోముల్లో దీపావళి వెలుగులు

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనాధ లైన మేధోవైకల్యం కలిగిన చిన్నారుల మోముల్లో 'భారతి మెరాకి', జీటీబీ డెవలప్‌మెంట్ సంస్థల ఆధ్వర్యంలోని శివ్య స్కూల్, ఆరుళోదయం ఫౌండేషన్‌తో కలిసి ఆనందం నింపాయి. 40 మంది బాలికలు, యువతులకు క్యాన్‌టెడ్ హ్యాంపర్లు, మిఠాయిలు, రకరకాల బహుమతులు అందజేసి, దీపావళి పండుగ ముందుగానే నిర్వహించాయి. ఆయా సంస్థల డైరెక్టర్ సుకన్య కన్నప్పన్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భారతి మెరాకి, జీటీబీ సంస్థల వ్యవస్థాపకుడు, ఎండీ అరుణ్ భారతి మాట్లాడుతూ.. '1000 స్మైల్స్' ప్రచారం ద్వారా నిజమైన పురోగతి కేవలం వృద్ధిలో మాత్రమే కాకుండా ఇతరులకు మనం అందించే దాతృత్వంలో కూడా కొలవబడుతుందనే విషయం తమకు గుర్తు చేయబడిందని తెలిపారు. మనం పంచుకునే ప్రతి చిరునవ్వు కరుణామయమైన ప్రపంచంవైపు ఒక అడుగు ముందుకు వేయిస్తుందని పేర్కొన్నారు.



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

దీపావళి కానుక అందజేసిన మాజీ మంత్రి

● కరూర్ నియోజకవర్గంలో సందడి

పారిస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కరూర్ నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ శనివారం దీపావళి కానుక అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కరూర్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన ఆ నియోజకవర్గంలోని సుమారు 88వేల కుటుంబాలకు దీపావళి పండుగ సందర్భంగా స్వీట్లు, ఇతర పదార్థాల తో కూడిన కిట్ల పంపిణీ కార్యక్రమానికి కోడంగిపట్టి ప్రాంతంలో శ్రీకారం చుట్టారు. ముందుగా ఆ ప్రాంతంలోని ప ట్టాలమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి వచ్చే ఎన్నికల్లో డీఎంకే మళ్లీ ఘన విజయం సాధించాలని అమ్మ వారిని ప్రార్థించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కరూర్ జిల్లా కడవూరు ప్రాంతంలో 250 ఎకరాల్లో నూతన పారిశ్రామిక జోన్ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం స్థలాన్ని కేటాయించిందని, త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అరవకుర్చి ప్రాంతంలో 6.5 ఎకరాల్లో మురుంగై పార్క్, కరూర్ కార్పొరేషన్ పరిధిలో రూ.405 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, మరో రూ.260 కోట్లతో తాగునీటి పథకం పనులను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కరూర్ కార్పొరేషన్ ప్రతినిధులు శరవణన్, కనకరాజా, ఎస్ఆర్ రాజా, పళని స్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు దీపావళి కానుక అందజేస్తున్న సెంథిల్ బాలాజీ

250 మంది విద్యార్థులకు 'మయోపియా స్క్రీనింగ్'

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కంటి సంరక్షణలో ప్రసిద్ధి చెందిన మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో 250 మందికి పైగా విద్యార్థులకు మయోపియా స్క్రీనింగ్ నిర్వహించారు. నగరంలోని బిషప్ కాటన్ ఆంగ్లో ఇండియన్ హయ్యర్ సెకండరీ స్కూలులో జరిగిన ఈ శిబిరంలో సాంకేతిక నిపుణులు స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సర్జన్ డాక్టర్ దినేష్ బాలకుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పిల్లల్లో మయోపియా లేదా హస్వ దృష్టి లోపం సర్వసాధారణంగా మారుతోందని, అందువల్ల కంటి సంరక్షణ కోసం తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇతర ఆరోగ్య పరీక్షల మాదిరిగానే క్రమం తప్పకుండా కంటి పరీక్షలు కూడా నిర్వహించడం చాలా అవసరమని సూచించారు.



ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

దీపావళి పండుగ జరుపుకోవద్దు

● టీవీకే కార్యకర్తలకు బుస్సీ ఆనంద్ సూచన

పారిస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) తరఫున దీపావళి పండుగ జరుపుకోవద్దని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ కార్యకర్తలకు సూచించారు. కరూర్‌లో గత నెల 27న ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ పాల్గొన్న రోడ్‌షో తొక్కిసలాటలో మృతిచెందిన 41 మంది కుటుంబాల్లో విషాదం నెలకొన్న దృష్ట్యా ఈ దీపావళి పండుగ జరుపుకోరాదని, సోమవారం ఆయా ప్రాంతాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలు మృతుల చిత్రపటాలతో బ్యానర్లు ఏర్పాటు చేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించాలంటూ ఆనంద్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

విజయ్ నేతృత్వంలో కొత్త కూటమి

● టీటీవీ దినకరన్

పారిస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ నేతృత్వంలో కొత్త కూటమి ఏర్పాటవుతుందని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పేర్కొన్నారు. చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్ కోయిల్ సమీపంలో శనివారం ఏఎంఎంకే నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడు నెలలే ఉన్నందువల్ల తమ పార్టీ తరఫున అన్ని జిల్లాల నిర్వాహకులతో సమావేశమై చర్చిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో నాలుగు కూటములు పోటీచేసే వాతావరణం స్పష్టంగా కనిపిస్తోందని, విజయ్ నేతృత్వంలో బలమైన కూటమి ఏర్పాటు అయ్యే అవకాశముందన్నారు.

పారిశుధ్య కార్మికులకు దీపావళి బహుమతులు



బహుమతులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు కన్నన్ తదితరులు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దీపావళి బహుమతులు అందజేశారు. జీసీసీ పరిధిలోని కేకే నగర్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఉద్యోగులకు శనివారం బాణసంచా ప్యాకెట్, కొత్త దుస్తులు, స్వీట్లు అందజేశారు. చెన్నై గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జీఆర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఎస్.కన్నన్, ఎం.అన్నామలై తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి చీరలు వేలం

● పోటీపడిన మహిళలు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా మడపురం భద్రకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన వేలంలో చీరల కోసం మహిళలు పోటీపడ్డారు. ప్రసిద్ధి చెందిన భద్రకాళి అమ్మవారి ఆలయానికి ప్రతిరోజు వచ్చే భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి చీరలు సమర్పిస్తుంటారు. ఆ చీరలను ప్రతి శుక్రవారం ఆలయ ప్రాంగణంలో వేలం వేస్తుంటారు. శుక్రవారం నిర్వహించిన వేలంలో రూ.100-రూ.500 నుంచి ప్రారంభమైన వేలం పాట వేల రూపాయల వరకు సాగింది. 300లకు పైగా చీరలను వేలంలో కొనుగోలు చేశారు. ఈ విషయమై ఆలయ అధికారులు మాట్లాడుతూ.. సాధారణంగా వేలంలో వంద చీరలు మాత్రమే విక్రయమవుతుంటాయని, దీపావళి పండుగ కావడంతో 300 చీరలు వేలంలో విక్రయమైనట్లు తెలిపారు.



వేలంలో పాల్గొన్న మహిళలు

రైతుల కడుపుకొట్టొద్దు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

పారిస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం రైతుల కడుపు కొడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. శనివారం ఆయన ఎక్స్‌పేజీలో ఈ మేరకు పోస్టుచేశారు. నాగపట్నం జిల్లాలో గత పదిరోజులకు పైగా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయకుండా డీఎంకే ప్రభుత్వం జాప్యం చేస్తోందని, మార్కెటింగ్ కమిటీకి ధాన్యం బస్తాలను సరఫరా చేసిన అన్నదాతల కష్టాన్ని ప్రభుత్వం నిరుగార్చడం సరికాదన్నారు. జిల్లావ్యాప్తంగా మార్కెటింగ్ కమిటీల్లో సుమారు 15వేలకు పైగా ధాన్యం బస్తాలు పేరుకు పోయాయని, వీటిని కొనుగోలు చేయడంలో జాప్యం జరిగిందంటూ అధికారులు చెబుతున్న సమాధానం అంగీకారయోగ్యం కాదన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతుల పొట్టకొడుతోందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో దీని ఫలితం అనుభవించాల్సివస్తుందని నాగేంద్రన్ అభిప్రాయపడ్డారు.



హిందువుల పండుగలకు శుభాకాంక్షలు చెప్పరెందుకు?

● బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్

పెరంబూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హిందువుల పండుగలకు మాత్రం ముఖ్యమంత్రి శుభాకాంక్షలు చెప్పడం లేదని బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ విమర్శించారు. ఈ మేరకు ఆమె విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. నేను నాస్తికుడను అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి స్టాలిన్, హిందువుల పండుగలకు మాత్రం శుభాకాంక్షలు చెప్పడం లేదు కానీ, ఇతర మతాల పండుగలకు మరిచిపోకుండా శుభాకాంక్షలు తెలుపుతున్నారని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా వంద కోట్ల మంది హిందువులు జరుపుకునే దీపావళి పండుగకు శుభాకాంక్షలు తెలుపకపోవడం పాసిస్ట్ చర్యలా ఉందన్నారు.

రెస్టో బార్‌పై తీవ్ర వ్యతిరేకత

● పుదుచ్చేరి ఎమ్మెల్యే రాస్తారోకో

పుదుచ్చేరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో రెస్టో బార్ ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేస్తూ ప్రజలతో కలిసి ఉరుళయన్‌పేట ఎమ్మెల్యే నెహ్రూ శనివారం రాస్తారోకోలో నిర్వహించారు. ఉరుళయన్‌పేట నియోజకవర్గ పరిధిలోని తిరువళ్లువర్ రోడ్డులో మహిళ మల్లై బాలికల ప్రభుత్వ మహోన్నత పాఠశాల సమీపంలో రెస్టో బార్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ విషయం తెలిసిన చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు బార్ ఏర్పాటుచేస్తున్న ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే నెహ్రూ వారికి మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న తహసీల్దార్ రాకేష్ కన్న, పోలీసు అధికారులు సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం వెల్లడించనున్నట్లు హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించుకున్నారు.



4రోజుల సెలవులు...

పుదుచ్చేరి, కారైక్కాల్‌లో దీపావళి సందర్భంగా శనివారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నాలుగు రోజులు సెలవులు ప్రకటించడంపై ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. నాలుగు రోజుల వరుస సెలవుల్లో సొంతూళ్లకు వెళ్లి తిరిగొచ్చే ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు తదితరులకు తమిళనాడులో లాగే ఈ నెల 21వ తేదీ మంగళవారం కూడా ఆ రాష్ట్రప్రభుత్వం సెలవు ప్రకటించడం గమనార్హం.

న్యాయమూర్తిని విమర్శించిన రిటైర్డ్ పోలీసు అధికారికి 'నో బెయిల్'

పారిస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనకు సంబంధించిన కేసుపై విచారణ జరిపిన న్యాయమూర్తిని విమర్శించిన ఆరోపణపై రిటైర్డ్ పోలీసు అధికారికి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు బెయిల్ నిరాకరించింది. గత నెల 27న టీవీకే అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందిన కేసులో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రిటైర్డ్ పోలీసు అధికారి వరదరాజన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం జైలులో ఉన్న ఆయనకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ ఆయన తరఫు న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు బెయిల్ నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

డీఎంకే వైపే యువత

● పళ్లిపట్టు పార్టీ కార్యదర్శి సీజే శ్రీనివాసులు

తిరుత్తణి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు యూనియన్ డీఎంకే కార్యదర్శి సీజే శ్రీనివాసులు పుట్టినరోజు సందర్భంగా శనివారం ఉదయం ఆయన పార్టీ కార్యాలయంలో పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలరాజుపేట డీఎంకే నిర్వాహకులు మనోహర్, యువజన విభాగం నిర్వాహకులు భాస్కర్ యాదవ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని కార్యదర్శి సీజే శ్రీనివాసులును శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీజే శ్రీనివాసులు మాట్లాడుతూ, డీఎంకేకు యువత మద్దతు ఎప్పుడూ ఉంటుందని, పార్టీ శ్రేణులు కూడా ఉత్సాహం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేను మళ్లీ గెలిపించేలా ప్రజల్లో నిర్వాహకులు అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నిర్వాహకుల సమక్షంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పళ్లిపట్టు సహా పలు ప్రాంతాలకు చెందిన డీఎంకే నిర్వాహకులు పాల్గొన్నారు.



సీజే శ్రీనివాసులను సత్కరిస్తున్న పార్టీ నిర్వాహకులు

విరిసిన ఇంద్ర ధనుస్సు

● సెల్ఫీలు తీసుకున్న యువత

తిరుత్తణి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా గత వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు తిరుత్తణిలోని పలు వీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. క్రమంలో శనివారం ఉదయం తిరుత్తణిలో భారీవర్షం కురిసింది. సాయంత్రం 4 గంటలకు వర్షం ఆగిన అనంతరం ఆకాశంలో ఇంద్రధనుస్సు ప్రజలను కనువిందు చేసింది. సాధారణంగా ఇంద్రధనుస్సు కనిపిస్తే వర్షాలు తగ్గుముఖం పడుతాయనే నమ్మకం ప్రజల్లో ఉంది. యువత ఇంద్రధనుస్సుతో సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు.



తిరుత్తణిలో విరిసిన ఇంద్రధనుస్సు

కుట్రాలం సందర్శనకు అనుమతి నిరాకరణ



కుట్రాలం ప్రధాన జలపాతంలో నీటి ఉధృతి

చెన్నై,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):తెన్‌కాశి జిల్లాలో గత రెండు రోజులుగా భారీగా వర్షాలు కురుస్తుండటంతో కుట్రాలం జలపాతం వద్ద వరద పరిస్థితి నెలకొంది. ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం తదితర ఐదు జలపాతాల వద్ద నీటి ఉధృతి కారణంగా పర్యాటకుల సందర్శనపై అధికారులు నిషేధం విధించారు.తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంతవరకూ పర్యాటకులు కుట్రాలం వద్ద స్నానమాచరించకూడదంటూ హెచ్చరికలు జారీ చేశారు.

అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాల చోరీ కేసు

● విచారణకు హాజరైన ఇద్దరు నక్సలైట్లు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆవలాంజి అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు చోరీచేసిన కేసులో, ఇద్దరు నక్సలైట్లు ఊటీ కోర్టుకు హాజరయ్యారు. ఊటీ సమీపం ఆవలాంజి అటవీ ప్రాంతంలో 2017లో అటవీ శాఖ ఏర్పాటుచేసిన సీసీ కెమెరా చోరీకి గురికాగా, వాటి మూడు కెమెరాలు ధ్వంసమయ్యాయి. ఈ వ్యవహారంలో అటవీ శాఖ అందజేసిన ఫిర్యాదుతో, మీంజూరు పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. అటవీ ప్రాంతంలో ఉన్న మరో సీసీ ఫుటేజీ పరిశీలించగా, కేరళ రాష్ట్రానికి చెందిన నక్సలైట్లు సంతోష్, సోమన్, విక్రమ్ గౌడ, మణివాసగం కలిసి కెమెరాలు ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ఈ కేసు ఊటీ సెషన్స్ కోర్టుల విచారణ జరుగుతోంది. శుక్రవారం విచారణకు, కేరళ రాష్ట్రం త్రిశూర్ జైలులో ఉన్న సంతోష్, సోమన్‌లను పోలీసు బందోబస్తు మధ్య ఊటీ కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారించిన న్యాయమూర్తి మురళీధరన్, నవంబరు 6వ తేదీకి కేసు విచారణ వాయిదావేశారు. అనంతరం ఇద్దరిని మళ్లీ కేరళ జైలు తరలించారు. కాగా, ఈ కేసుకు సంబంధించి విక్రమ్ గౌడ, మణివాసగం గతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు.

హత్యకు దారితీసిన అనుమానం

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భార్య నడవడికపై అనుమానించిన భర్త, ఆమెను హతమార్చిన ఘటన సేలం జిల్లాలో చోటుచేసుకుంది. తడకపట్టి రాగూర్ వీధికి చెందిన కన్నన్ (37),రతిదేవి (27) దంపతులకు కుమార్తె అనే కుమార్తె, శ్రీధర్ అనే రెండేళ్ల కుమారుడున్నారు. కన్నన్ పాత ఇనుప దుకాణం నిర్వహిస్తుండగా, రతిదేవి అదే ప్రాంతంలోని ఎక్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తోంది. రతిదేవి తరచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా కన్నన్ పలుమార్లు ఖండించాడు. అయినా ఆమె మాట వినకపోవడంతో, ఆమె నడవడికపై అనుమానించిన కన్నన్, ఆమెతో గొడవ పడేవాడు. భర్త వేధింపులను తట్టుకోలేని రతిదేవి, మూడు నెలల క్రితం కన్నవారింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో, శుక్రవారం మామగారింటికి వెళ్లిన కన్నన్, భార్యతో మాట్లాడాలని కోరాడు. ఆ సమయంలో భార్యాభర్తల మధ్య మళ్లీ వివాదం జరిగింది. కన్నన్ ఆగ్రహంతో తన వెంట తెచ్చిన కత్తితో రతిదేవిపై దాడిచేయడంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందింది. అనంతరం ఇంటి మిద్దె మీద నుంచి కన్నన్ తప్పించుకునేందుకు యత్నించగా, ఆతని స్కూటర్ స్టార్ట్ కాకపోవడంతో, దానిని అక్కడే వదిలి పరుగులు తీశాడు. చుట్టుపక్కల వారు ఆతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తిరుత్తణి హుండీ ఆదాయం రూ.1.43కోట్లు

తిరుత్తణి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కృత్తిక అనంతరం హుండీ కానుకలను లెక్కించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం ఆలయ జాయింట్ కమిషనర్ రమణి సమక్షంలో హుండీ ఆదాయం లెక్కింపు పనులు జరిగాయి. రూ.1.43కోట్ల నగదు, 214 గ్రాముల బంగారం, 10,428 గ్రాముల వెండి కానుకలు వచ్చాయని, ఈ మొత్తాన్ని ఆలయ బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ శ్రీధరన్ ఆలయ అధికారులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ నిర్వాహకులు

అప్సర రెడ్డికి రూ.50 లక్షలు చెల్లించాలనే ఉత్తర్వులు రద్దు

అడయార్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నాడీఎంకే అధికార ప్రతినిధి, హిజ్రా అప్సర రెడ్డికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని యూట్యూబర్ జో మైఖేల్ ప్రవీణ్‌కు ఇచ్చిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించేలా యూట్యూబ్‌లో వీడియోలు పోస్ట్ చేశారంటూ యూ ట్యూబర్ జో మైఖేల్ ప్రవీణ్‌పై అన్నాడీఎంకే అధికార ప్రతినిధి అప్సర రెడ్డి మద్రాసు హైకోర్టులో పరువు నష్టం కేసు వేశారు. అప్సర రెడ్డికి రూ.50 లక్షల పరిహారం అందించాలని జో మైఖేల్ ప్రవీణ్‌కు ఈ కేసు విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. తన వాంగ్మూలం తీసుకోకుండా, ఒకే తరపు వాదనతో ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ యూ ట్యూబర్ జో మైఖేల్ ప్రవీణ్ తరపున పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎస్.రమేష్, జస్టిస్ ... నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఆ సమయంలో, జో మైఖేల్ ప్రవీణ్ తరపున ... కేసుకు సంబంధించి ఎలాంటి నోటీసులు అందలేదని, న్యాయవాది సలహా ఆధారంగా అఫిడవిట్ దాఖలుచేయడం తప్పని వివరించారు. న్యాయవాది చేసిన తప్పుకు పిటిషనర్‌ను శిక్షించరాదని వాదించారు. ఈ వాదనల అనంతరం ధర్మాసనం, న్యాయవాది చేసిన తప్పు వల్ల పిటిషనర్ బాధపడరాదని వ్యాఖ్యానిస్తూ, రూ.50 లక్షల పరిహారం ఉత్తర్వులు రద్దు చేశారు. అలాగే, పరువు నష్టం కేసు మళ్లీ విచారించాలని ఆదేశించారు.

ఆకాష్ భాస్కరన్ కేసులో ఈడీ అధికారులకు నోటీసు

అడయార్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆకాష్ భాస్కరన్ వేసిన కేసులో, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు విచారణకు హాజరుకావాలని మద్రాసు హైకోర్టు నోటీసులిచ్చింది. నగరంలో టాస్మాక్ కార్యాలయంలో మార్చి నెలలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. అలాగే, పలువురు పారిశ్రామికవేత్తల నివాసాల్లోనూ దాడులు జరిగాయి. ముఖ్యంగా, ప్రముఖ సినీ నిర్మాత ఆకాష్ భాస్కరన్, పారిశ్రామికవేత్తలు విక్రమ్, రవీంద్రన్ తదితరులకు చెందిన ఇళ్లలో తనిఖీలు జరిగాయి. ఈడీ దాడులకు వ్యతిరేకంగా ఆకాష్ భాస్కరన్, విక్రమ్, రవీంద్రన్‌లు హైకోర్టులో పిటిషన్లు దాఖలుచేశారు. ఈ పిటిషన్లు విచారించిన న్యాయమూర్తులు, ఆకాష్ భాస్కరన్ సహా ముగ్గురి నుంచి స్వాధీనం చేసుకున్న దస్తావేజులు వారికి అప్పగించాలని, వారిపై తదుపరి చర్యలకు నిషేధం విధించింది. కానీ, ఆకాష్ భాస్కరన్ నుంచి స్వాధీనం చేసుకున్న దస్తావేజులు అప్పగించని ఈడీ, నోటీసు పంపినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఈడీ అప్పీలేట్ అథారిటీ ద్వారా సమన్లు జారీచేసినట్లు తెలిసింది. న్యాయస్థానం ఉత్తర్వులు ఉల్లంఘించి నోటీసు పంపించడాన్ని ఆకాష్ భాస్కరన్ తరపున న్యాయస్థానంలో ధిక్కరణ కేసు వేశారు. ఈ కేసు విచారించిన మద్రాసు హైకోర్టు, ఈడీ అప్పీలేట్ అథారిటీ ఛైర్మన్ ప్రదీప్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ నేరుగా హాజరుకావాలని నోటీసు జారీచేసింది.

ముత్తారమ్మన్ ఆలయ హుండీ ఆదాయం రూ.5.23 కోట్లు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టణం ముత్తారమ్మన్ ఆలయ దసరా ఉత్సవాలు సెప్టెంబరు 23నుంచి అక్టోబరు 2వ తేది వరకు జరిగాయి. వేడుకలకు వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి హుండీలో కానుకలు సమర్పించారు. ఆలయంలో 18 శాశ్వత హుండీలు ఉండగా, దసరా ఉత్సవాల సందర్భంగా మరో 75 తాత్కాలిక హుండీలు ఏర్పాటుచేశారు. హుండీల ఆదాయం లెక్కింపు రెండు రోజుల క్రితం ఆలయ ప్రాంగణంలో చేపట్టారు. రూ.5,22,96,146 నగదు, 146 గ్రాముల బంగారం, 2284.900 గ్రాముల వెండి, 21 విదేశీ కరెన్సీ భక్తులు కానుకగా సమర్పించారని ఆలయ అధికారులు తెలిపారు.

'ఆణ్ పావమ్ పొల్లాదదు' ట్రైలర్ లాంచ్ వరల్డ్ రికార్డు


'ఆణ్ పావమ్ పొల్లాదదు' ట్రైలర్ లాంచ్ దృశ్యం

చిత్రజ్యోతి

రియో రాజ్, మాళవికా జంటగా నటించిన 'ఆణ్ పావమ్ పొల్లాదదు' చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుక ప్రపంచ రికార్డు సాధించింది. ఏకంగా ఎనిమిది వేల మంది విద్యార్థుల సమక్షంలో ఈ మూవీ ట్రైలర్ లాంచ్ చేశారు. ఇది ప్రపంచ రికార్డుగా నమోదైంది. డ్రమ్‌స్టిక్ ప్రొడక్షన్స్ పతాకంపై వేదిక్కారన్‌పట్టి శక్తివేల్ నిర్మాణంలో దర్శకుడు కలైయరసన్ తంగవేల్ రూపొందించారు. శనివారం ఉదయం 11.30 గంటలకు ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం ఈరోడ్‌లోని ఎక్సెల్ కాలేజీలో నిర్వహించారు. ఇందులో వరల్డ్ రికార్డ్ డైరెక్టరేట్ అధికారిణి ఆలిస్ రేనాడ్ పాల్గొని ఈ ట్రైలర్ లాంచ్ వేడుకను ప్రపంచ రికార్డుగా గుర్తించి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత వేదిక్కారన్‌పట్టి శక్తివేల్ మాట్లాడుతూ, 'ఈ మూవీ సమాజంలోని అన్ని వర్గాలకు బాగా కనెక్ట్ అవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రజలు, విద్యార్థుల సమక్షంలో ట్రైలర్ రిలీజ్ చేసి, దీనిని ప్రపంచ రికార్డుగా మార్చిన ఎక్సెల్ కాలేజీతో పాటు విద్యార్థినీ విద్యార్థులకు ధన్యవాదాలు' తెలిపారు. హీరో రియో రాజ్ మాట్లాడుతూ, 'ఇది నా సొంతూరు. నేను పుట్టి పెరిగిన ప్రాంతంలో ఇంత గొప్ప కార్యక్రమం జరుగుతుందని ఊహించలేదు. ఈ సినిమా కోసం యూనిట్ సభ్యులంతా ఎంతగానో శ్రమిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఈ చిత్రం ఈ నెల 31వ తేదీ విడుదలకానుంది.

సెట్‌కు క్లీన్ స్లేట్‌గా వెళ్తా

● మమితా బైజు



సినిమా సెట్ వెళ్ళేటపుడు క్లీన్ స్లేట్ (ఖాళీ పలక)లా వెళతానని, అందువల్ల తనకు ఏ భాషలో కూడా సమస్య ఎదురుకాలేదని యువనటి మమితా బైజు అన్నారు. హీరో ప్రదీప్ రంగనాథన్‌తో కలిసి ఆమె నటించిన తాజా చిత్రం 'డ్యూడ్'. తమిళం, తెలుగు భాషల్లో శుక్రవారం విడుదలై మంచి పాజిటివ్ టాక్‌తో విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఆమె స్పందిస్తూ, 'ఈ దీపావళి రెట్టింపు సంతోషాన్ని ఇచ్చింది. నేను ఒక్క మలయాళంలోనే కాదు. తమిళం, తెలుగు, కన్నడ భాషా చిత్రాల్లో నటిస్తున్నాను. ఆయా భాషల సినిమా షూటింగులకు వెళ్ళే సమయంలో నా మైండ్‌లో ఎలాంటి ఆలోచన లేకుండా క్లీన్ స్లేట్‌గా వెళ్తాను. అక్కడి పరిస్థితులు, స్థానిక అంశాలకు అనుగుణంగా నన్ను నేను మార్చుకుంటాను. మలయాళంలో కూడా ఒకేసారి రెండు చిత్రాల్లో నటించే సమయంలో కూడా ఏ ఒక్క యూనిట్ సభ్యుల నుంచి ఇబ్బందులు ఎదురుకాలేదు. దర్శకుడు సూచనల మేరకు, స్క్రిప్టుకు అనుగుణంగా నడుచుకుంటే ఎలాంటి సమస్యా రాదు' అని పేర్కొన్నారు.

'జన నాయగన్' స్టోరీ ఆ చిత్ర కథేనా?


'జన నాయగన్'లో విజయ్

హెచ్.వినోద్ దర్శకత్వంలో అగ్రహీరో విజయ్ నటిస్తున్న కొత్త చిత్రం 'జన నాయగన్'. ఈ చిత్రం స్టోరీపై రకరకాలుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా 1997లో మలయాళ నటుడు సురేష్ గోపి నటించిన 'జనాధిపతి' సినిమా బాణీలోనే ఉంటుందనే కొందరు భావిస్తున్నారు. సాధారణంగా విజయ్ నటించే చిత్రాల్లో ప్రత్యేకత ఉంటుంది. కానీ, 'జన నాయగన్' మాత్రం గత చిత్రాలకు భిన్నంగా తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. ఇందులో దివంగత మహా నటుడు ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) ఫొటోలు, ఆయనకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు, డైలాగులను కూడా ఈ చిత్రంలో ఉపయోగిస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. దీనికి కారణం ప్రస్తుతం విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టి, వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తన సత్తా చాటాలని ఉవ్విళ్ళూరుతున్నారు. పైగా ఈ చిత్రాన్ని వచ్చే యేడాది సంక్రాంతికి విడుదల చేయనున్నారు. అప్పటికే రాష్ట్రంలో ఎన్నికల సందడి మొదలైవుంటుందని, అందువల్ల ఈ సినిమాలో ఓటర్లను ఆకర్షించేలా ఎంజీఆర్ ఫొటోలు, డైలాగులు, పాటలు ఉండేలా విజయ్ జాగ్రత్తలు తీసుకుంటున్నారని కోలీవుడ్ వర్గాల సమాచారం.

నిర్ణయం రజనీకాంత్ చేతుల్లోవుంది


రజనీకాంత్, మారి సెల్వరాజ్

● మారి సెల్వరాజ్

సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్రానికి దర్శకత్వం వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, తనతో కలిసి పనిచేయాలా? వద్దా? అనేది తలైవర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ప్రముఖ దర్శకుడు మారి సెల్వరాజ్ అన్నారు. 'జైలర్-2' తర్వాత రజనీకాంత్ ఎవరి దర్శకత్వంలో నటించనున్నారనే చర్చ కోలీవుడ్‌లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు దర్శకుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. వాటిలో ఒకటి మారి సెల్వరాజ్ ఒకరు. ఈ నేపథ్యంలో రజనీకాంత్‌ను డైరెక్ట్ చేస్తారా అనే ప్రశ్నకు మారి సెల్వరాజ్ బదులిస్తూ, 'రజనీకాంత్‌ను పలుమార్లు కలిసాను. నా దగ్గరున్న కథలు వినిపించాను. నేను దర్శకత్వం వహించిన సినిమాలు విడుదలైన తర్వాత నన్ను ఇంటికి ఆహ్వానించి అభినందిస్తుంటారు. 'వాళై' సినిమా కోసం ఒక పెద్ద లేఖ పంపించారు. అలాంటి హీరో చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశం వస్తే ఎవరైనా వదులుకుంటారా? ఈ విషయంపై సంప్రదింపులు కూడా జరుగుతున్నాయి. ఏదిఏమైనా తుది నిర్ణయం రజనీకాంత్ తీసుకోవాలి. నా వద్ద అనేక కథలున్నాయి. వాటిలో రజనీకాంత్, ధనుష్, శింబు ఎవరైనా నటించవచ్చు. తలైవర్ ఒకే చెబితే స్టోరీ మరికొంత డెవలప్ చేయాల్సి ఉంటుంది. నన్ను, నా కథలను నమ్మి వచ్చే ఏ హీరోతోనైనా కలిసి పని చేసేందుకు నేను సిద్ధం' అని మారి సెల్వరాజ్ అన్నారు. కాగా మారి సెల్వరాజ్ - ధ్రువ్ విక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కి శుక్రవారం విడుదలైన 'బైసన్' మూవీ హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న విషయం తెల్సిందే.

ఫీనిక్స్ మార్కెట్ సిటీలో 'అజోర్ట్' స్టోర్


నటి కృతిశెట్టిని అభినందిస్తున్న ధవల్ దోషి

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ముంబైలో విజయవంతంగా ప్రారంభించబడిన రిలయన్స్ రిటైల్ ప్రీమియం ఫ్యాషన్, జీవనశైలి బ్రాండ్ 'అజోర్ట్'..తన సరికొత్త స్టోర్‌ను వేళచ్చేరిలోని ఫీనిక్స్ మార్కెట్ సిటీలో ప్రారంభించింది. ప్రముఖ సినీ నటి కృతి శెట్టి శనివారం ఈ స్టోర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. 15,211 చదరపు అడుగుల విస్తీర్ణంలో వున్న ఈ స్టోర్.. సాంకేతికత, సమకాలీన శైలి లో ఫ్యాషన్ రిటైల్ పునర్నిర్వచించాలనే అజోర్ట్ దార్శనికతను కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ మార్కెటింగ్ హెడ్ ధవల్ దోషి పాల్గొన్నారు.

పెరియార్ ప్రచార వాహనంలో మంత్రి పళనివేల్ త్యాగరాజ్

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో జీడీ నాయుడు ఎగ్జిబిషన్‌లో ద్రవిడ ఉద్యమ నేత ఉపయోగించిన ప్రచారవాహనాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ సందర్శించారు. శనివారం ఉదయం ఆ ఎగ్జిబిషన్‌లో కొత్త కార్ల విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా వింటేజ్ కార్ల విభాగంలో పెరియార్ ఉపయోగించిన ప్రచార వాహనంలో పళనివేల్ త్యాగరాజన్, జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్, జీడీ నాయుడు మనవడు రాజ్‌కుమార్ కాసేపు కూర్చుని సందడి చేశారు. అనంతరం జీడీ నాయుడు వినియోగించిన పాత కార్లను ఆసక్తిగా తిలకించారు.


పెరియార్ ప్రచార వాహనం (బస్సు)లో కూర్చున్న మంత్రి పళనివేల్‌రాజన్, కలెక్టర్ పవన్ కుమార్, జీడీ నాయుడి మనవడు రాజ్‌కుమార్






సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో...


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న టి.నగర్ రంగనాథన్ వీధి


కిక్కిరిసిన రైలు


విద్యుత్ దీపాల వెలుగుల్లో టి.నగర్ పాండిబజార్



కేఆర్‌ఎం పాఠశాల విద్యార్థుల సందడి


కోయంబేడు బస్ టెర్మినల్‌లో ప్రయాణికుల రద్దీ




సబర్బన్ రైల్వేస్టేషన్, రైళ్లలో తనిఖీలు


బాణసంచా విక్రయాలు

దివ్వెల పండుగ శోభ

● ఊపందుకున్న బాణసంచా, వస్త్ర విక్రయాలు

ప్యారీస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆనంద దీపాల పండుగను సోమవారం జరుపుకోనున్న నేపథ్యంలో, రాష్ట్రానికి పండుగ శోభ వచ్చింది. రాజధాని నగరం చెన్నై నుంచి రాష్ట్ర సరిహద్దు జిల్లాలైన కోయంబత్తూర్, కన్నియాకుమారి, హోసూరు, వేలూరు ప్రాంతాల్లో ఎటుచూసినా ప్రజలు దీపావళి సందడిలో మునిగిపోయారు. నేము దారం నుంచి టపాసుల వరకు, పండ్లు, వెండి, బంగారు ఆభరణాల వరకు ఏదైనా సరే ధర ఎంత ఎక్కువైనా సరే ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పండుగ రోజు సంతోషంగా గడపాలన్న ఉద్దేశంతో ప్రజలు పూజా సామగ్రితో పాటు టపాసులు కొనుగోలు చేస్తున్నారు.

విద్యుత్ వెలుగుల్లో...

కొనుగోలుదారులను ఆకట్టుకొనేలా నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలైన టి.నగర్, వాషర్‌మెన్‌పేట, పురుషవాక్కం, మైలాపూర్, ఎగ్మూర్, వడపళని, అడయార్, ప్యారీస్, నేతాజీ రోడ్డు, షావుకారుపేట, మన్నడి, తిరువొత్తియూరు, కాలడిపేట, ఎన్నూర్, మనలి, అంబత్తూరు, విల్లివాకం, ఆవడి, పట్టాభిరామ్ తదితర ప్రాంతాల్లో ఉన్న షాపింగ్ మాల్స్, వస్త్ర, నగల దుకాణాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. టి.నగర్ పాండి బజార్ వీధులు విద్యుద్దీపాలతో ప్రకాశిస్తున్నాయి.

శబ్ద, వాయు కాలుష్యం...

వర్షం కురుస్తున్నప్పటికీ ముందుగానే నగరవాసులు బాణసంచా కాలుస్తుండటంతో గ్రేటర్ చెన్నైలో వాయు, శబ్దకాలుష్యం పెరిగింది. ఆది,సోమవారాల్లో అత్యధికంగా వాయుకాలుష్యం నమోదయ్యే అవకాశముందని, అధిక శాతం రసాయనాలు లేని టపాకాయలు మాత్రమే పేల్చాలని పర్యావరణ ప్రేమికులు విజ్ఞప్తి చేశారు. దీపావళిని పురస్కరించుకొని నగరవాసులు శుక్రవారం సాయంత్రం నుంచే పలు ప్రాంతాల్లో బాణాసంచా కాలుస్తున్నారు.

బస్సులు, రైళ్లలో పెరిగిన రద్దీ...

రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉంటున్న ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, వలస కార్మికులు పండుగ నేపథ్యంలో, గత మూడు రోజులుగా సొంతూళ్లకు క్యూ కట్టారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు పండుగ రద్దీ దృష్ట్యా రోజు నడిపే బస్సులతో పాటు అన్ని జిల్లాల మధ్య ప్రత్యేక బస్సులు నడుపింది. అదే విధంగా దక్షిణ రైల్వే కూడా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నప్పటికీ, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. రద్దీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైల్వేపోలీసులు, అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగండి

● గ్రాండ్ మాస్టర్ కార్తికేయన్ పిలుపు

● ఘనంగా మహర్షి విద్యామందిర్ స్పోర్ట్స్ మీట్

ప్యారీస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ పౌరులుగా విద్యార్థులు ఎదగాలని చెస్ గ్రాండ్ మాస్టర్, ఐసీఎఫ్ సీనియర్ అకౌంటెంట్ పి.కార్తికేయన్ పేర్కొన్నారు. పెరియమెట్‌లోని నెహ్రూ స్టేడియంలో శనివారం చూలైలోని మహర్షి విద్యామందిర్ సీనియర్ సెకండరీ పాఠశాల 11వ వార్షిక స్పోర్ట్స్ మీట్ గౌరవ కరస్పాండెంట్ టీవీ రామకుమార్ అధ్యక్షతన జరిగింది. ప్రిన్సిపల్ పి.సుబ్రమణ్యం స్వాగతం పలికిన ఈ వేడుకల్లో కార్తికేయన్ ముఖ్యఅతిథిగా హాజరై సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ కేటగిరీలకు నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేశారు. అలాగే ఓవరాల్ ఛాంపియన్ జట్టుకు ఎస్‌కేపీడీ ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, సీఆర్.కిషోర్‌బాబు, తాతా బద్రినాథ్, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్ ట్రోఫీలను అందజేసి అభినందించారు. పాఠశాల మేనేజర్ శ్రీలత, పీఈటీలు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



➤ విజేతలతో గ్రాండ్ మాస్టర్ కార్తికేయన్, టీవీ రామకుమార్, దేసు లక్ష్మీనారాయణ తదితరులు

పెరంబూరులో రూ.34.9 లక్షలతో మల్టీలెవల్ కేంద్ర భవనం

ప్యారీస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు నియోజకవర్గంలో రూ.34.9లక్షలతో నిర్మించిన మల్టీలెవల్ కేంద్ర భవనం శనివారం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ), చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అథారిటీ(సీఎండీఏ) నిధుల సహకారంతో తిరువీకా జోన్ 71వవార్డు రాజీవ్‌గాంధీ పార్క్ సమీపంలో హైటెక్ వసతులతో కూడిన ఈ భవనాన్ని హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, సీఎం స్టాలిన్ ఉత్తర్వుల మేరకు ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్, స్థానిక సంస్థల ప్రతినిధుల నియోజకవర్గ అభివృద్ధి నిధులతో దారిద్ర్య రేఖకు దిగువ ప్రాంతాలోని ప్రజల జీవన శైలి మెరుగుపరిచేందుకు విద్య, చిన్నారులు లబ్ధిపొందేలా సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఆ రీతిలోనే పెరంబూరులో మల్టీలెవల్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. నగరం, శివారు ప్రాంతాల్లో ట్రాఫిక రద్దీ నియంత్రణకు సీఎండీఏ తరుపున కూతంబాక్కం ప్రాంతంలో కొత్త బస్ టెర్మినల్ నిర్మాణం పనులు దాదాపు 95శాతం పూర్తయ్యాయని తెలిపారు. అదేవిధంగా చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో రూ.200కోట్లతో నిర్మిస్తున్న మెగా బస్ టెర్మినల్‌ను జనవరిలో ప్రాంభించేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సీఎండీఏ ఆధ్వర్యంలో రూ.200 కోట్లతో 13 ఎంటీసీ బస్టాండ్లు నిర్మిస్తున్నామని, ప్రస్తుతం అంబత్తూరు, వ్యాసర్పాడి ముల్లైనగర్‌లో నిర్మిస్తున్న బస్ టెర్మినళ్లు ఈ నెలాఖరుకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఆర్.ప్రియ, ఎమ్మెల్యే తాయగంకవి, జోన్ ఛైర్మన్ సరిత, కార్పొరేటర్ పునీతవతి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మంత్రి శేఖర్‌బాబు తదితరులు

20 అనాథాశ్రమాలకు కాదంబరి సహాయాల పంపిణీ

వేలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని వీఐటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి ఎస్.విశ్వనాథన్ శనివారం వేలూరు, గుడియాత్తం చుట్టుపక్కలున్న 20కి పైగా అనాథాశ్రమాలకు నిత్యావసర వస్తువులు, మిఠాయిలు, బాణసంచా తదితర సహాయాలను విరాళంగా అందించారు. వివిధ అనాథాశ్రమాలు, అంధ పాఠశాలల్ని సందర్శించి వెయ్యి మందికి పైగా ఉపయోగపడే సహాయాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, కాదంబరి భర్త డాక్టర్ శ్రావణ్ కృష్ణ పాల్గొన్నారు.


సహాయాలు అందిస్తున్న కాదంబరి, డాక్టర్ శ్రావణ్ కృష్ణ, శంకర్ విశ్వనాథన్